క థా ని క

# ఇల్లరికపు టల్లుడు

పోలవరపు శ్రీహరిరావు

సంక్రాంతి రోజులు. మంచు ముమ్మరంగా కురుస్తూంది. ఆ పెద్ద మర్రిచెట్టు ఆకులు తడిసిన చలికాక్కాబోలు ఏడుస్తున్నాయ్. ఆ ముసలి మర్రి మొదట ఒక చీకటి జీవి పళ్ళు కదనొక్కుకుంటున్నాడు. వర్షాలకు మట్టికొట్టుకుపోగా బైట పడ్డ వేరుల మధ్య తన్ని పట్టుకు పడుకున్నా, ముణగ తీసుకున్నా - చలి వదలడంలేదు. తను చొక్కా, పంచెలని మురిసే కిటికీలగుడ్డలు చలి కాపలేవుగా !

గజగజా వణుకుతూ లేచి చెట్టు నానుకుకూర్చున్నాడు. ఒళ్లు విరుచుకుని బ్రహ్మంగారి తత్వం పాడుతూ ఎంగిలి బీడీలకోసం తను పడుకున్న ప్రదేశమంతా వెదికి రెండు ముక్కలు సంపాదించాడు. నిప్పు దొరికే దెలా ? పాట చాలించి రోడ్డు వెంట బయలుదేరాడు. చలిపోవడానికి పొగ తాగడం తర్వాత, ఉపాయం గొంతెత్తి పాడడమే - అతనికి తెలిసింది.

"ఏమి కాయం బేమి జీవనమూ
ఓ మాయజీవా
ఏమి శాశ్వత మేమి నిత్యమురా॥
నాది నాదని పొంగి పోయేవూ
ఓ పిచ్చి జీవా
నీది ఏదీ వెంటరాదు గదా॥"

ఈ స్వంత కవిత్వం సాగదీసిన కొద్దీ సాగుతుంది. కాని, నిప్పు దొరికేవరకూ అతని కూపి రాదదు. కాఫీ హోటళ్లకు పాల కావిళ్ళవారు వస్తున్నారు. ఒకర్నడిగి అగ్గిపెట్టె తీసుకుని బీడీ పీక ముట్టించాడు. ఒక్క గుక్కపీల్చే సరికి అరంగుళపు ముక్క హరించుకుపోయి నోరు చుర్రు మనిపించింది. 'ఛీ — దీని దుంపతెంచ' అని దాన్ని గిరాటువేశాడు. మళ్ళా రెండో ముక్కకు అగ్ని సంస్కారం కోసం ఆ తిరస్కరించిన దాన్నే ఆశ్రయించాడు.

వెల్కం హోటల్లో చలిబనీన్లూ, కోటులూ' మప్లర్లూ అప్పుడే వేడి వేడి యిడ్లీ సాంబార్ మేస్తున్నాయ్. పెసరట్లపెనం టకటకా మోగిపోతూంది. ఇతడు కళ్లు చిట్లించి జేబులు తడుముకున్నాడు. గాలించగా చిల్లి కానీ దొరికింది. ఒక్క నిట్టూర్చి తలగోక్కున్నాడు. ఆఖరు కానీ ఎందుకూ కొరగాకుండావుంది. రెండు బీడీలుకొని ఆ మనిషి అరంగుళం పెరిగాడు.

కుక్క నదలించినట్లు 'ఛీ ఛీ' అంటున్నా వినిపించుకోకుండా హోటల్ గల్లా ప్రక్కనున్న వేపపుల్ల తీసుకుని దంతధావనం చేసుకుంటూ ఆలోచించాడు. 'అదేం జబ్బోగాని - ముఖం కడుక్కోగానే ఆ కలవుతుంది... కాఫీ తాగేదెలాగు ?... నా గుడ్డలు చూచిన సర్వరు డబ్బులున్నయ్యా అని అడుగుతాడే ?' అనుకుని ముఖం తోలిచేశాడు. తాటిపీచు తల చేత్తో సర్దుకుని, చొక్కా విప్పి మన్ను దులిపి తొడుక్కుని నాలుగడుగులు నడిచి మోడరన్ కేఫ్లో దూరి - ఓ చీకటి మూల బల్లమీద కూర్చున్నాడు.

సర్వర్ అనుమానంగా చూస్తూంటే - 'ఏమిటయ్యా అలాచూస్తావ్ ? నేనూ మనిషినే...... తొందరగా పోవాలి - పెసరట్టు చెప్పి, మూడిడ్లీ సాంబార్ తీసుకురా' అని ఆజ్ఞాపించాడు. అవి పూర్తిచేసే సరికి దూరపు ఆయిల్ ఫ్యాక్టరీ గి గంటల కూత కూసింది. అతడు ఎక్కువడి - 'అదుగో ఆరయింది...త్వరగా పూరీ కూరా, కాఫీ తేవయ్యా వెళ్లాలి' అని విసుక్కున్నాడు. సర్వర్ వినయ విన్రముడై అన్నీ యిచ్చి బిల్లు యిచ్చి మరో టేబుల్ దగ్గరకు వెళ్ళాడు.

తాపీగా కాఫీ తాగి, మంచి నీళ్ల గ్లాసు చేత బుచ్చుకుని హోటల్ దొడ్లోకి వెళ్లాడు. చూచిన వాళ్ళు చేతులు కడుక్కొంటానికి కాబోలు అనుకుంటారని అతడికి తెలుసు. దొడ్లో పనివాళ్లు పనుల్లో మునిగివున్నారు. యూరినల్ గోడ

గొంతీ, గొంది కూడా పరుగుతీసి మరోరోడ్డు యెక్కాడు.

బ్రేవ్‌మని త్రేన్చి బీడీ ముట్టించాడు. ఎన్ని చోట్ల చెయిజాపినా 'దున్నపోతులా వున్నావ్ - కూలి చేసుకోరాదూ? ప్రతివాడికీ అడుక్కోవడం చవకయిపోయింది' అనే తిరస్కారాలు ఎదురయ్యాయి. ఎంగిలి బీడీలూ, పంపునీళ్లూ పుష్కలంగా దొరికినా పన్నెండింటికి ఆకలి దహించి వేస్తోంది. హోటల్‌వాళ్ళను మోసం చేద్దామంటే- భోజనం టిక్కెట్టు డబ్బులిచ్చి ముందే తీసుకోవాలట్యే. నేషనల్ రెస్టారెంటువారి గొందిలోని ఎంగిలాకులకోసం కుక్కలతో యుద్ధంచేసి అలిసిపోయాడు.

కడుపునిండక యింకా ఎంగిలి మెతుకులకోసం ఎదురుచూస్తూనే నిద్దరపోయాడు. మధ్యాహ్నం గడచి నాలుగయిన తర్వాత మళ్లా టీ వేటకు బయలుదేరాడు. నలుగురయిదుగుర్ని అడిగితే— 'అడుక్కుతినేవాడికి-టీ, కాఫీ కావలిసొచ్చాయా? ఇంకా నయం మాయింట పరమాన్నం వడ్డించమన్నావ్ కాదు!' అని తమకున్న వ్యంగ్యవిమర్శాజ్ఞానాన్నంతా వొలకబోశారు. కడుపులో ఆకలి పురుగులు ఏడుస్తున్నాయి. ముఖం గంభీరంగా పెట్టి 'నియో పేరడైజ్'లో దూరాడు.

అక్కడ రొట్టె, వెన్న, టీలకోసం కార్మికులెక్కువగా వస్తూంటారు. డాక్టర్లకూ, షావుకార్లకూ యిచ్చినంత గౌరవం నూనె, మసిగుడ్డల వాళ్ళక్కూడా లభించే దక్కడే. తెలిసో తెలియకో అతడందులో దూరి పావలారొట్టె, కప్పు టీ తీసుకున్నాడు. బిల్లు తీసుకుని చెయి కడుక్కోవడానికి దొడ్లోకెళితే కోటగోడలు కనిపించాయి. లాభంలేదని గల్లాదగ్గర బిల్లుపెట్టి పట్టి చేతుల్తో నుంచున్నాడు.

తర్జనభర్జనల్లో గల్లాదగ్గిరి ఖద్దరు గుడ్డలాయన— 'డబ్బుల్లేకుండా నీయబ్బ సొమ్మని హోటల్లో కొచ్చావురా—' అని తిడుతూంటే అతడు నవ్వుకున్నాడు. వంట గదిలోనుంచి మరొక నల్లాయన వచ్చి 'యిటువంటివాళ్ళ నరెస్టుచేసి-సెటిల్‌మెంటులో పెట్టి-బంజరు భూములు సాగుచేయించాలనలు' అని సెలవిచ్చాడు. అతడు (మన కథానాయకుడు) 'ఆ మంచి రోజుకోసమే ఎదురు చూస్తున్నా బాబూ...కాస్త పుణ్యం కట్టుకుండురూ- టవున్ పోలీస్‌స్టేషన్ దగ్గరే వుంది - [illegible] కాళ్ళకు మొక్కుతాను; మీ హోటల్లో గల్లాతో దొంగతనమో చేశానని ఆ అత్తవారింటికి పంపిద్దురూ-కంద్రీ' అని దణ్ణాలు పెడుతున్నాడు.

అంతవరకూ అంతగా కోప్పడ్డ ఖద్దరుబట్టల గల్లామనిషి-'మాకెందుకాగొడవంతా-మాకు చాలా పనులున్నాయి- ఇకచాలు దొంగముండాకొడకా- ఈసారియిటువచ్చావంటే కాళ్ళువిరగ్గొడతాం, తెలిసిందా' అన్నాడు. వంటగదిలోంచి వచ్చిన మానవుడు తిరిగి వంటింట్లోకే వెళ్ళిపోయాడు. మన హీరో మొఖంమీద మొత్తుకుంటూ రోడ్డున పడ్డాడు.

ఇప్పు డత్తవారింటి కెళ్ళాలనే కోర్కె మరీ ఎక్కువైపోయింది. ఎలాగయినా సరే ప్రభుత్వపు అతిథిగా అయితే చాలు. ఇక యీ చలీ, తిండి వేట బాధలుండవు. పదిమంది రాజకీయఖైదీలకో, నలుగురు సివిల్ ఖైదీలకో కాళ్లు ఒత్తితే-బీడీలకూ, సిగరెట్లక్కూడా కరువుండదు. ఆ అదృష్టం పట్టాలే గాని-నిశ్చింతగా కాలుమీద కాలువేసుకుని కూనిరాగాలం పాడుకోవచ్చు ననుకున్నాడు.

ఎక్కడకు వెళ్లాలన్నా కొంత ప్రయత్నం, ఖర్చూ తప్పవుగా! అందుకనే 'శుభస్య శీఘ్రం' అని కృషి ప్రారంభించాడు. గడియారాలు గాజు తలుపుల వెనకనుంచి టిక్కుటిక్కుమని, రకరకాలుగా కొక్కిరిస్తున్నాయి. మంచిరాయి తీసుకుని గురిచూచి విసిరాడు. అద్దాల బీరువా, గోడ గడియారమూ బద్దలైపోయాయి. షాపుఆయన బండబూతులు తిడుతూ 'ఎవడువాడు', 'పట్టుకోండి' అని కేకలేస్తూ రోడ్డెక్కాడు. జనం మూగారు. మన అతడు నవ్వుతూ 'నేనే'నంటున్నా వినిపించుకోకుండా షాపాయన నోరు ఖాళీ చేసుకుంటున్నాడు. మూగిన జనంలో ఒక కూలీ-పనిలోకి కాబోలు వెళ్లిపోతున్నాడు- అతడే అంతపనీ చేసిన 'బద్మాష్' అని నాలుగుతన్ని వదిలిపెట్టారు.

ఎవరిదోవను వాళ్ళు పోయినా, అ[illegible] మిగిలి- తన దౌర్భాగ్యానికి నెత్తీనోరూ కొట్టుకున్నాడు. ఆలోచనతో నడుస్తూ పోలీస్‌స్టేషన్ చేరాడు. ఎదురుగా నిలబడి 'నేను గజదొంగని...ఖూనీకోర్ని... ఆరుసార్లు జైలుకెళ్ళాను... నా నలభైయేళ్ల బతుకులోనూ పదిహేనేళ్ళు జైళ్ల

[illegible] గడిచి పోయింది... మొన్న వదిలారు... నిన్న ఒక చిన్న పిల్లను గొంతు పిసికి వెండి పట్టా అమ్ముకు బతికాను. ఇవ్వాళ మూడు ఘోరాలు చేశాను... నన్ను అరెస్టు చెయ్యండి... నేను దొంగను ...గజ దొంగను' అని రాత్రి ఎనిమిదింటి దాకా అరిచాడు. 'తాగుబోతా, పోరా దూరంగా - వెధవ్వాగుడూ నువ్వూనూ' అని పోలీసులు తోసేశారు.

ఈ రాత్రికూడా మర్రిచెట్టు మంచు నీడ తప్పదేమోననే భయంతో ముందుకు నడిచాడు. మూడంతస్తుల మేడమీదనుంచి ఓ నవయౌవన సుందరాంగి దిగి రోడ్డుమీద నుంచుంది. కీనీడనుంచి ఒక బొద్దుమీసాల బలిష్ఠుడు లేచి, పిడికిళ్లు బిగించి, నాలుకతో పెదాలు చప్పరిస్తూ - చూపులతో ఆ సుందరాంగిని మింగేస్తున్నాడు.

మన హీరోకు అర్థంకాలేదు. కాని; పాతికేళ్ళ క్రితం తాగినమత్తులో భార్యను మంగళసూత్రం కోసం మెడనులిమి చంపకపూర్వం రాత్రులు గుర్తుకొచ్చాయ్. శరీరం పులకరించింది. సుందరి తన వైపు చూచి నవ్వుతూంది. లైట్ల వెలుతురులో ఎర్రని పెదిమెలు తనను ఆహ్వానిస్తున్నాయ్. ఆమె ప్రక్కగా వెళదామని నడిచాడు. ఆమె తన ప్రక్కనే నడిచింది. రోడ్డు చివర, ప్రక్క సందులోకి తిరిగిన తర్వాత ఆమె వెనక్కు చూసింది.

చప్పరించి వెళ్లిపోయాడు. గుడిలో పురాణం చెబుతున్నారు. దూరంగా కూర్చుని పురాణనీతులు విన్నాడు. తన జీవితభ్రమణాన్ని పరిశీలించుకున్నాడు. ఏడుపొచ్చింది. కూలి చేసుకున్నా, గుడిలో వెచ్చగావుండేది. పాపిష్ఠి తాగుడుకోసం యిల్లూ గుల్లయింది, పెళ్ళాన్నికూడా చంపాడు. పన్నెండేళ్ల జైల్లో వున్నందుకు తాగుడు అలవాటు పోయింది. కాని, యీ ఖూనీకోరుకు కూడెం వాళ్ళు రానివ్వలేదు. తన గుడిశ నాక్రమించుకున్న వెంకడిని తన్నినందుకు ఏణ్ణర్థం జైలుకెళ్లాడు.

ఇక జైలుజీవితమే అలవాటయిపోయింది. జైల్లో వున్నంతకాలం, యిక వదలగానే కూలి చేసుకుని హాయిగా మంచిగా బ్రతుకుదామనుకునేవాడు. బైటకొచ్చి అనుకున్న కూలి దొరక్క ఆ పనీ యీ పనీ చేసి, రాత్రులు చలి బాధపడలేక - ఏ దొంగతనమో చేసేవాడు. ఒకసారి రోడ్డు మేస్త్రీ భార్య పిలిస్తే గట్టు వెనక కలియడానికి వెళ్ళాడు. మేస్త్రీకి తెలిసి దొంగకేసు బనాయించి మళ్ళా అరెస్టుచేయించాడు. ఇదే తన జీవితం. ఎంత నీచం! ఆరోజే వుదయం - నోరు చుర్రుమనిపించిన బీడీ ముక్కను ధిక్కరించి పారవేసి; మళ్ళా రెండో ముక్కకు అగ్ని సంస్కారం కోసం ఆ తిరస్కరించిన దాన్నే ఆశ్రయించటం! అదే అతని జీవితం.

ఈసారి జైల్లోకి వెళ్లడం సాధ్యమయ్యేలా లేదు. ఏం చెయ్యాలో తోచడంలేదు. ఇంతలో సినిమా బోర్డుల వూరేగింపు వచ్చింది. ఒక కుర్ర కుంకని పిలిచి 'నీకు జీతమెంతరా?' అన్నాడు. వాడు 'పదిహేను. ఇంకా సినిమాలుహాయిగాచూడొచ్చు. హాల్లో వెచ్చగా కుర్చీల్లో పడుకోవచ్చు' నని చెప్పాడు. మన అతడూ అదనే చేద్దాం - యికనైనా పాపపు దోవ వదులుదాం అని నిశ్చయించుకుని మర్రిచెట్టు దగ్గరకు ప్రయాణమయ్యాడు. తను జీవితాన్ని ఒక నిర్ణయం ప్రకారం-మంచిగా నడుపుకోబోతున్నాడు గనక చింత తీరినట్లయింది. ఇక అత్తవారిల్లనే నరకానికి పోరాదు.

ఎటువంటి వారికైనా ఆ శుభసమయంలో పాట తోసుకువస్తుంది. పాడుతున్నాడు, స్థాయి హెచ్చిస్తూ.

"చిన్నది యేమందిరా?
అన్నా
నిన్ను రమ్మందిరా!
ఏమి తెమ్మందిరా?
అన్నా
చీరల్ తెమ్మందిరా!"

నాలుగు పక్కల్నుంచీ యీలలు వేసుకుంటూ పోలీసులు వచ్చారు. లాఠీలు అతని రక్తం కళ్ళజూచాయ్. 'నేనే పాపమూ ఎరగను బాబో' అని అతడు మొత్తుకుంటూంటే - 'నీ దొంగ ఏడుపులు మా దగ్గరట్రా సాగేది? ఇంపీరియల్ బ్యాంక్‌కే కన్నం వేస్తావ్‌రా?' అని బాదుకుంటూ తీసుకెళ్లి జైల్లో తోశారు పోలీసులు.

పోలీసులన్నది అంతకు ముందు లేదుగాని— యికనుంచీ ప్రభుత్వ ఖాతాకు ఖర్చుక్కవేశాడు, అతడు. కావలంటే వెళ్ళలేకపోయినా; వద్దనుకుంటే అత్తవారింటి అతిథి అయ్యాడు - అతడు; ఆ దౌర్భాగ్యుడు!